సాక్షి
అనకాపల్లి
గురువారం । 6 । జూన్ । 2024



ఎరుకుమాంబకు జలాభిషేకం

విశాఖ: దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకు మాంబ అమ్మవారికి బుధవారం భక్తులు పసుపు నీటితో అభిషేకం నిర్వహించారు.



తీరం అల్లకల్లోలం

భీమిలి: బీచ్ రోడ్డు తీర ప్రాంతం బుధవారం ఒక్కసారిగా అల్లకల్లోలంగా మారడంతో పర్యాటకులను లైఫ్‌గార్డ్స్ అప్రమత్తం చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
35.8/27.5

వాతావరణం

తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

108 వాహనంలో ప్రసవం

- తల్లీ బిడ్డ క్షేమం



108 వాహనంలో బిడ్డకు జన్మనిచ్చిన అప్పలరాజు

నక్కపల్లి: 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఓ గర్భిణి బిడ్డకు జన్మనిచ్చింది. మండలంలో దోసలపాడు అగ్రహారానికి చెందిన దార్లపూడి అప్పలరాజు అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి ఫోన్ చేశారు. సిబ్బంది ఆమెను తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో తుని రైల్వే బ్రిడ్జి సమీపంలో నొప్పులు ఎక్కువయ్యాయి. వెంటనే వాహన సిబ్బంది రాము, చంద్రమౌళిలు వాహనాన్ని ఆపి ఆమెకు ప్రసవం చేశారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. వీరిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నాణ్యమైన జీవన ఎరువులతో అధిక దిగుబడులు



ఖరీఫ్ విత్తన దినోత్సవంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త విశాలాక్షి

అనకాపల్లి: నాణ్యమైన జీవన ఎరువులతో అధిక దిగుబడులు సాధించడంతో పాటు సాగు ఖర్చు తగ్గించుకోవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ఏడీఆర్ డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు, శాస్త్రవేత్త ఎం.విశాలాక్షి తెలిపారు. ఖరీఫ్ విత్తన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతులను ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధం చేసేందుకు ఖరీఫ్ విత్తన దినోత్సవాన్ని నిర్వహించినట్టు చెప్పారు. నైరుతి రుతుపవనాల సాధారణంగా జూన్ మొదటి వారంలో మనరాష్ట్రంలో ప్రారంభమవుతాయని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విత్తన ప్రాముఖ్యత, అధిక దిగుబడు సాధించేందుకు తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. ఆర్బీకేల్లో వరివిత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో చెరకు ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి, డి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఈఎన్‌టీలో వీడియో ఎండోస్కోపీ ప్రారంభం



వీడియో ఎండోస్కోపీని ప్రారంభిస్తున్న డాక్టర్ బుచ్చిరాజు

ఏయూక్యాంపస్: ప్రభుత్వ చెవి, ముక్కు, గొంతు ఆస్పత్రిలో నూతనంగా అందుబాటులోకి వచ్చిన వీడియో ఎండోస్కోపీ యూనిట్, ఆధునికీకరించిన ఓపీడీ, వైద్యుల చాంబర్లను బుధవారం ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు ప్రారంభించారు. ఎండోస్కోపీ యూనిట్‌ను మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి బహూకరించిన సంగతి తెలిసిందే. ఓపీడీలో పీజీ, యూజీ విద్యార్థులకు ఆడియో విజువల్ ఎడ్యుకేషన్ అందించడానికి వీడియో ఎండోస్కోపీ ఉపకరిస్తుందని సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణ తెలిపారు.

ప్రశాంతంగా సార్వత్రిక పరీక్షలు

అనకాపల్లి: సార్వత్రిక విద్యా పరిషత్ (ఓపెన్ స్కూల్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని విద్యాశాఖ ఆర్‌జేడీ బి.విజయభాస్కర్ తెలిపారు. స్థానికగవరపాలెం చిన్న హైస్కూల్, మెయిన్‌రోడ్డు పెద్ద హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెన్త్ ఆంగ్ల పరీక్షను మూడు కేంద్రాల్లో 119 మంది రాయగా, జిల్లాలోని ఆరు కేంద్రాల్లో 211 మంది ఇంటర్ పరీక్షలు ఆయన రాసినట్టు చెప్పారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.

అమాత్య పదవిపై ఆశలు!

- ఎవరికి వారే ఆశల్లో కూటమి ఎమ్మెల్యేలు
- సీనియారిటీ, సామాజిక సమీకరణాల లెక్కలు



సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. కూటమి తరఫున గెలిచిన ఎమ్మెల్యేల్లో అప్పుడే అమాత్య పదవిపై ఆశలు మొదలయ్యాయి. ఫలితాలు వచ్చి 24 గంటలైనా గడవక ముందే ఎవరికి వారు తమకే మంత్రి పదవి దక్కుతుందంటూ అంచనాలేసుకుంటున్నారు. వారితో పాటు వారి ప్రధాన అనుచరులు కూడా ఊహల పల్లకీలో ఊరేగుతున్నారు. సీనియారిటీ, సామాజిక సమీకరణలు, కూటమి పెద్దలతో ఉన్న పరపతి, పరిచయాలు, అనుబంధాలను ఇందుకు ఉదహరిస్తున్నారు. ఎవరికి అనుకూలంగా వారు లెక్కలేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 13 మంది ఎమ్మెల్యేలు కూటమి తరఫున ఎన్నికయ్యారు. వీరిలో నలుగురు జనసేన, ఒకరు బీజేపీ నుంచి, మిగిలిన ఎనిమిది మంది టీడీపీ నుంచి గెలుపొందారు.

- విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి నాలుగోసారి గెలిచిన వెలగపూడి రామకృష్ణబాబు ఈ దఫా మంత్రి పదవిని ఆశిస్తున్నారు. ఆయనకు బాలకృష్ణతో పాటు ఆయన అల్లుడు, విశాఖ ఎంపీగా ఎన్నికైన శ్రీభరత్‌తో సత్సంబంధాలున్నాయి. ఇవన్నీ తమ నాయకుడు వెలగపూడికి మంత్రి పదవి దక్కేందుకు కలిసొచ్చే అంశాలని ఆయన అనుచరులు చెబుతున్నారు.
- నాలుగోసారి గెలిచిన భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా మంత్రి పదవిపై నమ్మకంతో ఉన్నారు. గతంలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో మంత్రిగా పనిచేశారు. తన సామాజిక వర్గం కోటా కలిసొస్తుందని ఆయన ఆశతో ఉన్నారు.
- పెందుర్తి నుంచి జనసేన తరఫున ఎన్నికైన పంచకర్ల రమేష్‌బాబుకి ఇది మూడోసారి గెలుపు. దీంతో తన సీనియారిటీ, జనసేన కోటా, సామాజికవర్గం కలిసొచ్చే అంశాలుగా చెప్పుకుంటున్నారు. అయితే గంటా, పంచకర్లది ఒకే సామాజికవర్గం కావడంతో ఈయనకు మంత్రి పదవి ప్రతిబంధకంగా మారుతుందని అంటున్నారు.
- నర్సీపట్నం నుంచి ఏడోసారి గెలుపొందిన అయ్యన్న తనకు మంత్రి పదవి ఖాయమన్న భావనలో ఉన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ కేబినెట్‌లో స్థానం దక్కడంతో ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు.
- గాజువాక నుంచి టీడీపీ తరఫున రెండోసారి గెలిచిన పల్లా శ్రీనివాసరావు తన సామాజికవర్గ కోటాలో మంత్రివర్గంలో స్థానం ఉంటుందన్న నమ్మకంతో ఉన్నారు. ఆయన అనుచరులు ఇప్పటికే ఈ ప్రచారం మొదలు పెట్టారు.
- విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి రెండోసారి ఎన్నికైన విష్ణుకుమార్‌రాజు తనకు కూటమి బీజేపీ కోటాలో మంత్రివర్గంలో చోటు దక్కుతుందని ఆశతో ఉన్నారు. అయితే బీజేపీ నుంచి గెలిచిన సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్‌లు ఆయనకు పోటీగా ఉన్నారు.
- పాయకరావుపేట నుంచి రెండో దఫా ఎన్నికైన వంగలపూడి అనిత కూడా మంత్రివర్గంలో చోటు దక్కుతుందని ఆశిస్తున్నారు. ఎస్సీ సామాజికవర్గం, మహిళా కోటా తనకు కలిసొస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు.
- జనసేన తరఫున అనకాపల్లి నుంచి గెలిచిన కొణతాల రామకృష్ణ 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మంత్రిగా పనిచేశారు. జనసేనలో సీనియర్ అయిన కొణతాల తనకు కేబినెట్‌లో బెర్త్ ఖాయమని భావిస్తున్నారు.
- ఆఖరి నిమిషంలో మాడుగుల సీటు దక్కించుకుని పోటీ చేసి గెలిచిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. అయితే అయ్యన్నది, ఈయనది ఒకే సామాజికవర్గం కావడం అడ్డంకిగా మారుతుందని చెబుతున్నారు. ఇలా ఫలితాలు వెలువడ్డాయో లేదో అలా మంత్రి పదవులపై ఎవరికి వారే అంచనాల్లో మునిగి తేలుతున్నారు. వారి అనుచరులు సైతం బాహాటంగానే చెప్పుకుంటున్నారు.

అభ్యర్థుల కంటే నోటాకే అధికం

- పార్లమెంట్ పరిధిలో నోటాకు మూడో స్థానం
- మొత్తంగా 26,235 ఓట్లు నమోదు



యలమంచిలి రూరల్: అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి మొత్తం 15 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఇందులో బీజేపీ, వైఎస్సార్‌సీపీ వంటి ప్రధాన పార్టీల అభ్యర్థులను మినహాయిస్తే ఇతర పార్టీలు, స్వతంత్రులుగా పోటీ చేసిన అభ్యర్థులు కనీస పోటీ ఇవ్వలేకపోయారు. ప్రజల మద్దతును పొందడంలో విఫలమైన ఆ 13 మంది డిపాజిట్లు కూడా కోల్పోయారు. వారికి పోలైన ఓట్ల కంటే నోటాకు వచ్చిన ఓట్లే అధికంగా ఉండడం విశేషం. పలకా శ్రీరామ్మూర్తికి 19,157, వేది వెంకటేష్‌కు 24,833, నమ్మి అప్పలరాజుకు 2589, ఆడారి శరత్ చంద్రకు 1886, వడ్లమూరి కృష్ణస్వరూప్‌కు 3549, కర్రి విజయలక్ష్మికి 1578, తుమ్మగుంట అప్పలనాయుడుకు 1055, గారా సత్యారావుకు 3116, జున్నూరి జె శ్రీనివాస్‌కు 1195, డాక్టర్ తుమ్మపాల హరిశంకర్‌కు 1567, పెట్ల నాగేశ్వరరావుకు 2179, సిద్ధా లోవరాజుకు 3845, వంకాయల రామచంద్రరావుకు 4001 ఓట్లు పోలవ్వగా వీరందరి కంటే అధికంగా నోటాకు 26,235 ఓట్లు నమోదయ్యాయి. అత్యధికంగా మాడుగులలో 4880 ఓట్లు, అత్యల్పంగా అనకాపల్లిలో 1924 ఓట్లు నోటాకు పోలయ్యాయి.

అసెంబ్లీల పరిధిలో నోటాకు వచ్చిన ఓట్లు 20,111

జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా రెండు ప్రధాన పార్టీల తర్వాత అత్యధిక ఓట్లు వచ్చింది నోటాకే. అత్యధికంగా పాయకరావుపేట నియోజకవర్గంలో 4,107 రాగా..అత్యల్పంగా అనకాపల్లిలో 1,853 వచ్చాయి. యలమంచిలిలో 2,409, చోడవరంలో 3,849, మాడుగులలో 4,070, నర్సీపట్నంలో 3,824.. మొత్తం 20,111 ఓట్లు నోటాకు పడ్డాయి.

అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో నియోజకవర్గాల వారీగా నోటాకు పోలైన ఓట్లు

చోడవరం	4841
మాడుగుల	4880
అనకాపల్లి	1924
పెందుర్తి	3447
యలమంచిలి	2405
పాయకరావుపేట	4395
నర్సీపట్నం	4192
పోస్టల్ బ్యాలెట్లు	151
మొత్తం	26,235

గోదాముకు చేరిన ఈవీఎంలు




ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్లను భద్రపరచి గోదాములకు సీల్ వేయిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: లెక్కింపు ప్రక్రియ పూర్తి కావడంతో ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్లను గోదాములకు తరలించారు. కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, పోలీస్ సూపరింటెండెంట్ కె.వి.మురళీకృష్ణ, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల సమక్షంలో బుధవారం సాయంత్రం ఈ ప్రక్రియ నిర్వహించారు. ఎస్పీ కార్యాలయం వెనుక భాగంలో ఈవీఎం గోదాముల్లో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించిన ఈవీఎం మిషన్లను భద్రపరిచారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంలను గోదాములకు తరలించారు. ఈ ప్రక్రియలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో సక్సెస్

అనకాపల్లి: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్, కేంద్ర బలగాలు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను విజయవంతం చేసినట్టు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో అన్ని పార్టీల నేతలు, స్థానిక ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో 2024 సార్వత్రిక ఎన్నికలు నిర్వహించినట్టు ఆయన పేర్కొన్నారు.

నిండుకుండలా పెద్దేరు జలాశయం



పెద్దేరు జలాశయంలో జల కళ

మాడుగుల: మండలంలో రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో పెద్దేరు జలాశయంలోకి ప్రస్తుతం 50 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయ గరిష్ఠ నీటి మట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 136.15 మీటర్లకు నీటి మట్టం పెరిగింది. గత ఏడాది ఇదే సమయానికి 130 మీటర్లు మాత్రమే ఉంది. ప్రస్తుతం నీటి మట్టం పెరగడంతో ఖరీఫ్‌లో సాగునీటికి ఢోకా ఉండదని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరి నారు మడులు సిద్ధం చేశారు. మరో వారం రోజులలో నారు వేయనున్నారు.

నీట్‌లో రాణించిన రైతుబిడ్డ

- ఓబీసీలో 368, ఓపెన్ కేటగిరీలో 1142 ర్యాంకు సాధించిన కిరణ్
- మెడికల్ ఎంట్రన్స్‌లో ప్రతిభ చూపిన మరికొందరు జిల్లా విద్యార్థులు



నీట్‌లో మంచి ర్యాంకు సాధించిన కిరణ్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

యలమంచిలి రూరల్: వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన నీట్-2024 ఫలితాల్లో సాధారణ రైతు కుటుంబానికి చెందిన విద్యార్థి రాజాన కిరణ్ మంచి ప్రతిభ కనబరిచాడు. యలమంచిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన రాజాన కిరణ్ నీట్(యూజీ) ఫలితాల్లో 720 మార్కులకు గాను 705 మార్కులు సాధించి, ఓబీసీలో 368 ర్యాంక్, ఓపెన్ కేటగిరీలో 1142 ర్యాంక్ పొందాడు. 10వ తరగతిలో 476/500 మార్కులు(సీబీఎస్ఈ),12వ తరగతిలో 458/500 (సీబీఎస్ఈ) మార్కులు సాధించాడు.

కార్డియాలజిస్టునవుతా..

ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరి మంచి కార్డియాలజిస్టు కావడమే తన లక్ష్యంగా కిరణ్ 'సాక్షి'కి తెలిపాడు.విద్యార్థి తండ్రి రాజాన సత్యనారాయణ సాధారణ రైతు. కిరణ్ నీట్‌లో ఉత్తమ మార్కులు సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఇంటర్మీడియెట్ చదివించేందుకు తన కుమారుడికి విశాఖ డెయిరీ చైర్మన్,వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆడారి ఆనంద్‌కుమార్ సంవత్సరానికి రూ.50 వేల చొప్పున రెండేళ్లు రూ.లక్ష సాయం చేశారని సత్యనారాయణ చెప్పారు. ఆడారి ఆనంద్‌కుమార్ సహాయాన్ని మరిచిపోలేనని, ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఆయన తెలిపారు. విశాఖ నారాయణ కళాశాలలో చదివిన కిరణ్‌ను బుధవారం కళాశాల డీజీఎం హనుమంతరావు, ఏజీఎం నాగేశ్వరరావు,ఇన్‌చార్జ్ సింహాద్రి,అధ్యాపకులు, పురుషోత్తపురం గ్రామస్తులు అభినందించారు.

హేమంత్‌కు 557వ ర్యాంకు

నాతవరం: మారుమూల గిరిజన గ్రామానికి చెందిన సోలం హేమంత్ నీట్ ఫలితాల్లో 557 ర్యాంకు సాధించాడు. మండలంలో వెదురుపల్లి పంచాయతీ శివారు కోడవటిపూడి గ్రామానికి చెందిన హేమంత్ పశ్చిమ గోదావరి జిల్లాలో ఓ ప్రైవేటు ఇంటర్మీడియెట్ కాలేజీలో చదివాడు.హేమంత్ తండ్రి సోలం కొండబాబు మండలంలో సరుగుడుపంచాయతీ శివారు రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. హేమంత్‌కు ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి ఎంఈవో లు తాడి అమృత్‌కుమార్, కామిరెడ్డి వరహాలబాబు అభినందనలు తెలిపారు.



మొల్లేటి నివాస్



గుర్రం వీరవెంకట శరణ్య



హేమంత్

నీట్‌లో గ్రామీణ విద్యార్థుల ప్రతిభ

మునగపాక, రోలుగుంట : జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ ప్రవేశపరీక్షలో మునగపాక మండలం గంగాదేవిపేట, గణపర్తికి చెందిన విద్యార్థులు మెరుగైన మార్కులు సాధించి మండలానికి గుర్తింపు తీసుకువచ్చారు. గణపర్తికి చెందిన గుర్రం వీర వెంకట శరణ్య నీట్‌లో 681 మార్కులు సాధించింది. ఆల్ ఇండియా ర్యాంక్‌గా 8412 సాధించింది. చూచుకొండ పీహెచ్‌సీలో ఎంపీహెచ్ఈవోగా పనిచేస్తున్న గుర్రం శ్రీనివాసరావు కుమార్తె వీర వెంకట శరణ్య జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ ప్రవేశపరీక్ష రాసింది. 720 మార్కులకు గాను 681 మార్కులు సాధించి ఈ ప్రాంతానికి పేరు తీసుకువచ్చిందని వైద్యాధికారులు ఎస్తేర్‌రాణి, వినోద్‌కుమార్, రోలుగుంట పీహెచ్‌సీ వైద్యురాలు కె.ధనలక్ష్మి హర్షం వ్యక్తం చేస్తున్నారు. గంగాదేవిపేటకు చెందిన మొల్లేటి నివాస్‌కు 614 మార్కులు వచ్చాయి. 720 మార్కులకు గాను 614 మార్కులు సాధించాడు. గ్రామానికి చెందిన మొల్లేటి దేవీచంద్ర దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు నివాస్ ఇంటర్మీడియట్ విజయవాడలో చదువుకున్నాడు. ఎంబీబీఎస్‌కు సంబంధించిన నిర్వహించిన ప్రవేశపరీక్షకు నివాస్ హాజరయ్యాడు. జాతీయ స్థాయిలో వెలువడిన ఫలితాల్లో భాగంగా నివాస్ 720 మార్కులకు గాను 614 మార్కులను కైవసం చేసుకున్నాడు. కృషి,పట్టుదల ఉంటే చదువులో రాణించవచ్చని నివాస్ రుజువు చేశాడు. గ్రామీణ ప్రాంతంలో కష్టపడి చదివి నీట్‌లో మెరుగైన మార్కులు సాధించిన నివాస్‌ను పలువురు అభినందిస్తున్నారు.

ధర బాగున్నా.. పండని తమలపాకు

- దిగుబడి తగ్గడంతో రైతన్న దిగాలు
- భారంగా మారిన రవాణా ఖర్చులు



తమలపాకు తోటలు



ఎగుమతి చేయడానికి బుట్టల్లో సర్దుతున్న తమలపాకులు



ఎగుమతికి సిద్ధంగా వున్న తమలపాకు బుట్టలు

పాయకరావుపేట: తమలపాకులు.. ఈ ప్రాంతంలో పండే అరుదైన పంట. మండలంలోని సత్యవరం, మాసాహెబుపేట, పెదరాంభద్రపురం, శ్రీరాంపురం, మంగవరం, గోపాలపట్నం, అరట్లకోట గ్రామాల పరిధిలో సుమారు 800 ఎకరాల్లో రైతులు తమలపాకు తోటలు పెంచుతున్నారు. 3 వేల కుటుంబాలకు ఈ పంటే జీవనాధారం. మార్చి నుంచి జూన్ వరకు శుభముహూర్తాలు ఎక్కువ ఉండడంతో మంచి గిరాకీ ఉంది. మంచి ధర పలుకుతోంది. అయితే ఈసారి దిగుబడి తగ్గడంతో రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. పంధా (150) ఆకుల ధర గత ఏడాది 30-35 రూపాయలు ఉండగా ఈసారి రూ.50లు పలుకుతోంది. రూ.500 ఉండే బుట్ట ధర ఇప్పుడు వెయ్యి రూపాయలు. ధర బాగున్నా చీడపీడలు, రవాణా ఖర్చులు పెరిగిన కారణంగా ఈ సీజన్ ప్రోత్సాహంగా లేదని రైతులు చెబుతున్నారు.

పలు రాష్ట్రాలకు ఇక్కడి నుంచే రవాణా

వారానికి 4, 5 లారీల్లో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు ఈ మండలం నుంచే తమలపాకు ఎగుమతి అవుతుంది. వారానికి 3 వ్యాన్‌ల ద్వారా హైదరాబాద్‌కు సరకు పంపిస్తారు. రైళ్లలో కూడా ఆయా రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. గతంలో రోజుకు 3, 4 లారీల్లో సరకు పంపించేవారు. రైతులు అరెకరం నుంచి 5 ఎకరాల వరకు తమలపాకు తోటలు వేస్తుంటారు. ప్రతి ఎకరానికి రెండు లక్షల రూపాయల వరకు పెట్టుబడి ఖర్చులు అవుతాయి. రెండు సంవత్సరాల పాటు ఈ తోటలు జీవిస్తాయి. తోటలు మంచిగా పెరిగితే పెట్టుబడి పోగా 2 లక్షల వరకు ఆదాయం వస్తుంది. అయితే ఈ సీజన్‌లో తోటలు తెగుళ్ల బారిన పడడంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. దిగుబడి తగ్గిపోయి రైతులకు అనుకున్నంతగా ఆదాయం రాలేదు. ప్రస్తుతం శుభముహూర్తాలు, శుభకార్యాలు అధికంగా ఉండడం వలన ధర పెరిగినప్పటికీ దిగుబడి తగ్గడం, రవాణా ఖర్చులు పెరగడం వలన రైతులు నిరాశ చెందుతున్నారు. ఆదాయం తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆశించిన ఆదాయం రాలేదు



నేను 3 ఎకరాల్లో తమలపాకు తోట వేశాను. రూ.5 లక్షల పెట్టుబడి ఖర్చులు అయ్యాయి. తెగుళ్ల కారణంగా కొద్దిగా తోట చనిపోయింది. సకాలంలో వర్షాలు లేకపోవడం వలన దిగుబడి తగ్గింది. మార్కెట్‌లో ధర బాగున్నప్పటికీ దిగుబడి లేకపోవడం వలన ఆశించిన విధంగా ఆదాయం రాలేదు. రవాణా చార్జీలు పెరిగాయి. గతంకన్నా పెట్టుబడి ఎక్కువ.. దిగుబడి తక్కువగా ఉంటోంది.

–తమ్మిర్శి సత్యనారాయణ, తమలపాకు రైతు, సత్యవరం, పాయకరావుపేట మండలం

క్లుప్తంగా

విమ్స్ సీఎంవోగా డాక్టర్ అరుణదేవి

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(విమ్స్) క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్(సీఎంవో)గా డాక్టర్ అరుణదేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. కేజీహెచ్ ట్రామాకేర్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమెను ఇటీవల విమ్స్‌కు బదిలీ చేసిన సంగతి తెలిసిందే.

జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు లవకుమార్ ఎంపిక



జాతీయ స్థాయి క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన కె.లవకుమార్

అనకాపల్లి : జాతీయ స్థాయి క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలు ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకూ రాజస్థాన్ రాష్ట్రం గంగానగర్‌లో జరుగుతాయని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.బద్రీనాథ్ బుధవారం అన్నారు. ఈ పోటీలకు ఏపీ నుంచి జిల్లా క్రీడాకారుడు కె.లవకుమార్ 74 కేజీల విభాగంలో మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన చెప్పారు. మే 29, 30, 31 తేదీల్లో గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొంది, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆయన చెప్పారు.

బైకును ఢీకొన్న లారీ.. యువకుడి మృతి



మృతుడు ముత్యాల నాయుడు (ఫైల్)

కశింకోట : మండలంలోని బయ్యవరం వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. సీఐ ఎం.వినోద్‌బాబు అందించిన వివరాల ప్రకారం...యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న లారీ బయ్యవరం వద్ద అదే మార్గంలో వెళుతున్న బైక్‌ను వెనుకగా ఢీకొంది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న కె.కోటపాడు మండలం గొంపవానిపాలెం గ్రామానికి చెందిన గొంప ముత్యాలనాయుడు (36), స్నేహితుడు శంకర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముత్యాలనాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని, క్షతగాత్రుడు శంకర్‌ను అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతుడు ముత్యాల నాయుడుకు భార్య లక్ష్మి, కుమారుడు తనీష్ ఉన్నారు.

కప్ప కప్ప నీలాలు..
కురవాలి వర్షాలు

- చుట్టబందలో విభిన్న ఆచారం
- ఏటా క్రమం తప్పకుండా కప్పల పండగ నిర్వహణ
- 80 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం
- గ్రామస్తుల ఐక్యతకు నిదర్శనం
- వాటి జాతి పరిరక్షణకు కృషి

వర్షాలు కురవని సందర్భాల్లో వరుణుడి కరుణకోసం కప్పలను ఊరేగించడం.. వాటికి పూజలు చేసి.. పెళ్లి చేయడం చూస్తుంటాం. అయితే కినపర్తి పంచాయతీ చుట్టబందలో పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నం. వర్షాలు కురిసినా.. కురవకపోయినా ఏటా కప్పకు పూజలు చేసి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దాదాపుగా 150 సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ గ్రామంలో 80 ఏళ్ల నుంచి ఈ ఆచారం కొనసాగుతోంది.



కప్పను పూజించే చెట్టు వద్ద పసుపు, కుంకుమతో అలంకరణ



కప్పను ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు



ప్రతి ఇంటికి కప్పను ఊరేగింపుగా తీసుకువెళ్లి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

కొయ్యూరు: వరుణుడి కటాక్షం కోసం మండలంలోని చుట్టబంద గ్రామంలో బుధవారం కప్ప పండగ నిర్వహించారు. గ్రామస్తులు వేకువజామున పణుకుల గెడ్డ జలాశయంలో పట్టుకున్న కప్పను గ్రామంలోకి తీసుకువచ్చి స్నానం చేయించారు. పసుపు, కుంకుమతో పూజించారు. జోలెలో ఉంచి పూలదండతో అలంకరించారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ప్రతీ ఇంటి వద్దకు తీసుకువెళ్లిన కప్పకు పసుపు రాసి బిందెలతో నీళ్లు పోసి పూజించారు. అనంతరం దానిని ఒక చెట్టువద్దకు తీసుకువెళ్లి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఆ తరువాత తీసుకువచ్చిన జలాశయంలోనే తిరిగి విడిచిపెట్టారు. ఊరేగింపులో వాయిద్యాలు నడుమ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం పరిసర గ్రామాల ప్రజలను ఆహ్వానించి భోజనాలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గ్రామపెద్ద దుచ్చరి చిట్టిబాబు మాట్లాడుతూ వర్షాలు కురిసినా కురవకపోయినా కప్ప పండగను ఏటా నిర్వహిస్తామని తెలిపారు. గ్రామమంతా ఒక్కటై నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రామంలో కప్పలకు ఎటువంటి హాని తలపెట్టమన్నారు. పండగ నిర్వహించిన వెంటనే వర్షం కురవడం ఎంతో నమ్మకం కలిగిస్తుందన్నారు.

కప్ప అరిస్తే వర్షాలకు సంకేతం..

వర్షం కురిసినప్పుడు కప్పలు అరుస్తుంటాయి. సాధారణ రోజుల్లో కూడా అవి అరుస్తుంటే కొద్ది రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని సంకేతంగా భావిస్తుంటారు. కప్పలు, స్పష్టంగా, రాబోయే వర్షాలను గుర్తిస్తాయని గ్రామీణ ప్రజల నమ్మకం. అంతేకాదు హిందూ సంప్రదాయంలో, మానవ జాతిని రక్షించడానికి విష్ణువు ఉభయచర (కప్ప) అవతారం తీసుకున్నాడని కూడా చెబుతుంటారు.

విద్యార్థులూ.. చూసొద్దాం రండి!

- వేసవిలో విజ్ఞానాన్ని పంచుతున్న 'ట్రిడెంట్'
- ఎన్‌ఏడీలో ఎన్‌ఎస్‌టీఎల్ ప్రదర్శన శాల



యుద్ధ ట్యాంకు



ఎన్ఎస్‌టీఎల్ గేటు ఎదురుగా ఏర్పాటు చేసిన ట్రిడెంట్



జలాంతర్గామి రాకెట్లు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్ ఎన్ఎస్‌టీఎల్ గేటుకు ఎదురుగా ఏర్పాటు చేసిన యుద్ధ పరికరాల ప్రదర్శనశాల విజ్ఞానాన్ని పంచుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో)కు అనుసంధానంగా ఇక్కడి నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ(ఎన్ఎస్‌టీఎల్) ప్రజోపకరమైన కార్యక్రమాల్లో భాగంగా 'ట్రిడెంట్'ను రూపొందించింది. డీఆర్‌డీవో, ఎన్ఎస్‌టీఎల్ ఆధ్వర్యంలో తయారు చేసిన అధునాతన యుద్ధ పరికరాల నమూనాలను ఇక్కడ ప్రదర్శనశాలలో ఏర్పాటు చేశారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రయోగాలకు సిద్ధమవుతున్న భావి సైంటిస్టులు, విద్యార్థులు, అదే విధంగా ఉద్యోగులు, సాధారణ ప్రజలు సైతం దీనిని సందర్శించే అవకాశాన్ని కల్పించారు. యుద్ధ నౌక, యుద్ధ విమానం, వాయు, జలాంతర్గామిలో ఉపయోగించే రాకెట్లు ఇలా వివిధ రకాల యుద్ధ పరికరాల నమూనాలు నేటి తరం వారికి విజ్ఞానాన్ని పంచుతున్నాయి. 'ట్రిడెంట్'పేరుతో ఏర్పాటు చేసిన దీనిని మరింత సుందరంగా, అందరినీ ఆకట్టుకునేలా తీర్చిదిద్దేందుకు ఎన్ఎస్‌టీఎల్ యాజమాన్యం ఎంతో శ్రద్ధ తీసుకుంటోంది. చుట్టూ కంచె మాదిరి ఏర్పాటు చేసి, లోపలికి వెళ్లేందుకు గేటు పెట్టారు. చుట్టూ ఆహ్లాదరకమైన వాతావరణం ఉండేలా గ్రీనరీ పెంచుతున్నారు. ఈ నమూనాలను అటుగా వచ్చే వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



జలాంతర్గామి రాకెట్లు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

విద్యాశాఖ ఆర్జేడీ విజయ భాస్కర్



పర్యావరణ ప్రదర్శనలో విద్యార్థులతో కలిసి ఆర్జేడీ విజయభాస్కర్, డీఈవో చంద్రకళ



మొక్కలు నాటుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ విద్య : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ భాస్కర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. పెందుర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి 'పర్యావరణ పరిరక్షణ-మనందరి బాధ్య' అంటూ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ, చిత్ర లేఖన పోటీల్లో విజేతలుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ ఉంటుందన్నారు. ఇందు కోసం ప్రతీ ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలన్నారు. పర్యావరణ వేడుకల్లో సుమారుగా 2 వందల మంది విద్యార్థులను భాగస్వామ్యులను చేయటం పట్ల అధికారులు, ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం ఆయన సీతమ్మధార మండల భవిత కేంద్రాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసరావు, డిప్యూటీ డీఈవో కె.సువర్ణ, సెక్టోరియల్ అధికారులు అప్పలనాయుడు, జిల్లా సైన్సు అధికారి కప్పలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో..

ఏయూక్యాంపస్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కోర్టు ఆవరణలో న్యాయ సేవా ప్రాధికార సంస్థ, విశాఖ న్యాయవాదుల సంఘం, జిల్లా పర్యావరణ పరిరక్షణ సమితి ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల న్యాయమూర్తులతో కలిసి విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో కేంద్ర మీడియేషన్ కన్సిలేషన్ సభ్యురాలు న్యూఢిల్లీ కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి నిషా సక్సేనా, కేంద్ర న్యూఢిల్లీ జ్యుడీషియల్ అకాడమీ కార్యదర్శి డాక్టర్ అదితి అగర్వాల్, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బేవర సత్యనారాయణ, జిల్లా పర్యావరణ పరిరక్షణ మండలి చీఫ్ ఇంజనీర్ నాగిరెడ్డి, న్యాయమూర్తి ఎ.రాధాకృష్ణ, మెట్రోపాలిటీ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ, ఇతర న్యాయమూర్తులు, పర్యావరణ పరిరక్షణ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

సహజ వనరులను సంరక్షించుకుందాం

డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్



రైల్ల ప్రయాణికులకు నార సంచులు పంపిణీ చేస్తున్న డీఆర్ఎం



రైల్వే కాలనీలో మొక్కలు నాటుతున్న డీఆర్ఎం, ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులను రక్షించుకుందామని వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో బుధవారం జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటేనే రాబోయే తరాలకు మంచి భవిష్యత్‌ను అందించగలమన్నారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖపట్నం రైల్వేస్టేషన్ అవగాహన ర్యాలీ, అనంతరం పలు రైళ్లలో ప్రయాణికులకు నార సంచులను పంపిణీ చేశారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్, తన బృందంతో కలిసి రైల్వే కాలనీ, పార్కుల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఆర్ఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. కృష్ణా యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ సుంకరి రామకృష్ణ, ఆదికవి నన్నయ యూనివర్సిటీ, ఆర్‌జీయూకేటీ ప్రొఫెసర్ రావులు పర్యావరణాన్ని కాపాడుకునేందుకు, కాలుష్య నివారణకు అనుసరించాల్సిన పద్ధతులపై పలు సూచనలు చేశారు.

ఎంజేపీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం: జిల్లాలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో (ఇంగ్లీష్ మీడియం) 6 నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి తెలిపారు. ఈ నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు జరుగుతుందన్నారు.

చిరు వ్యాపారులపైకి దూసుకెళ్లిన కారు..ఒకరి మృతి



మృతుడు రమణ(ఫైల్)

నర్సీపట్నం : మున్సిపాలిటీ సీబీఎం కాంపౌండు సమీపంలో రోడ్డు పక్కన చిరువ్యాపారులపై కారు దూసుకెళ్లిన ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సీపట్నం నుండి చింతపల్లి వైపు వెళుతున్న కారు అతివేగంగా వెళుతూ సీబీఎం కాంపౌండు సమీపంలో ప్రధాన రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటున్న వారిపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో స్థానిక అయ్యన్న కాలనీకి చెందిన కొమ్మునాపల్లి రమణ (42) అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడు రమణ రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమణ మృతితో కుటుంబం రోడ్డున పడింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఉన్న వ్యక్తి, ఇద్దరు మహిళలు మోటారు సైకిల్‌పై పరారైనట్టు మృతుని భార్య లక్ష్మి చెబుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని ఆరా తీసారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, కారు ఓనర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



విశాఖలో బుధవారం వర్షం కురిసింది. ఉదయమంతా ఆకాశం మేఘావృతమై ఉంది. మధ్యాహ్నం నుంచి కారుమబ్బులు కమ్ముకున్నాయి. దీంతో తొలుత చిరుజల్లులు మొదలయ్యాయి. ఆపై కొంతసేపు మోస్తరు వర్షం కురిసింది. ఇలా సాయంత్రం వరకు తేలికపాటి వర్షం కొనసాగింది. వానతో పాటు బలమైన ఈదురుగాలులు కూడా వీచాయి. పెదగంట్యాడ, గాజువాకల్లో 3 సెం.మీలు, పెందుర్తిలో 2.7, సింహాచలం 2.1, మహారాణిపేట 1.1, భీమిలిలో 1 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది. గురు, శుక్రవారాల్లోనూ విశాఖలో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని, ఈదురుగాలులు కూడా కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. - సాక్షి, విశాఖపట్నం





క్లుప్తంగా

దంచికొట్టిన వాన



తెగిపడిన విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

తుమ్మపాల: మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరపి లేకుండా జడివాన కురిసింది. తొలుత వీచిన ఈదురు గాలులకు కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. దీంతో పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఒక్కసారిగా జడివాన మొదలై సాయంత్రం వరకు పడుతూనే ఉండటంతో జనజీవనం స్తంభించింది. రోడ్లపై వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సాయంత్రానికి తగ్గుముఖం పట్టడంతో రాకపోకలు మొదలయ్యాయి. పంట పొలాల్లో నీరు చేరింది. వరి సాగుకు ముందే దుక్కులు చేయడం, ఇప్పుడు వర్షపు నీటితో పొలాలు దమ్ముల నాటికి అనుకూలంగా ఉంటాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సిబ్బంది తక్షణమే స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కశింకోట: ఉరుములు, మెరుపులతో కశింకోటలో ఒక్కసారిగా వాతావరణం మారింది. మధ్యాహ్నం గంటకు పైగా ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. ఎండ వేడితో సతమతమవుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. ఈదురు గాలుల కారణంగా సుమారు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఎన్ఎంఎంఎస్‌లో సత్తా చాటిన విద్యార్థులు



ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులు

కోటవురట్ల: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో సత్తా చాటిన పలువురు విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌కు చెందిన విద్యార్థులు దుబాసి యశస్విని, మళ్ల చర్మిళ, సూరిశెట్టి రష్మిత, తీడ వెంకట రాజ్‌కుమార్, ఎత్తుల శివదుర్గ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. దాంతో ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాలీషా, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. మిగతా విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ ఫలితాల సాధనకు పట్టుదలగా కృషి చేయాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 240 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,500	4,750
రెండో రకం	3,960	4,300
మూడోరకం	3,500	4,050

అనకాపల్లి సినిమాలు

గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి	: రాజా
గం గం గణేశా	: సత్యనారాయణ స్క్రీన్-1
లవ్ మీ	: షిర్డిసాయి
హిట్ లిస్ట్	: పర్తిసాయి
రాజుయాదవ్	: వెంకటేశ్వర
బాక్	: శ్రీసత్య
భజే వాయు వేగం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు, ఓ పాజిటివ్-6 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 394 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 366 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాలు
- చిత్రలేఖనంతో మెరుగైన భావ వ్యక్తీకరణ–డీవైఈవో అప్పారావు

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఊరూవాడా వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు మొక్కల్ని నాటి ప్రజలకు అవగాహన కల్పించారు. పిల్లల్లో పర్యావరణ స్పృహ పెరిగేలా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మొక్కలతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని చాటిచెప్తూ పలు కార్యక్రమాలు చేపట్టారు.



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో డీవైఈవో అప్పారావు



సాయినగర్‌లో మొక్కలు నాటుతున్న పరిషత్ సభ్యులు

అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కల్ని విరివిగా నాటాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు కోరారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు ఫణిభూషణ్ శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అప్పారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో భావవ్యక్తీకరణకు చిత్రలేఖనం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరిలోనూ ప్రతిభ ఉంటుందని, దాన్ని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహిస్తే పిల్లలు ఆ రంగంలో అగ్రస్థాయికి చేరుకుంటారని తెలిపారు. ప్రస్తుత సమాజంలో ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను చిన్నారులు బొమ్మల ద్వారా చూపించడం అభినందనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన ఎన్నో చర్యలను చిత్రాల ద్వారా సమాజానికి తెలపడంతోపాటు, వాటిని చేయాలన్న తపన పిల్లల్లో పెరుగుతుందన్నారు. సామాజిక పరిస్థితులపై ఆలోచన రేకెత్తించేలా ఆధునిక చిత్రకళలో విద్యార్థులు రాణించాలన్నారు.

గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు ఫణిభూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి కర్తవ్యమన్నారు. దశల వారీగా జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, గ్రీన్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు పెంటకోట ఉమామహేశ్వరరావు, ప్రతినిధులు విశ్రాంత జిల్లా అటవీశాఖాధికారి జానకీరావు, అటవీ శాఖ విశ్రాంత రేంజర్ బి.వినోద్‌కుమార్, సభ్యులు ఆర్.అనిత, నీలవేణి, నగిశెట్టి సత్తిబాబు, భేతాళం శేషసాయి, కె.రాజేష్, కె.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిపాలెం హైస్కూల్లో..

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మామిడిపాలెం హైస్కూల్లో



మామిడిపాలెం గ్రామంలో మొక్క నాటుతున్న చిన్నబ్బాయి

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.చిన్నబ్బాయి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. తొలుత పర్యావరణ పరిరక్షణపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

సాయినగర్‌లో..

మండలంలోని కొత్తూరు పంచాయతీ సాయినగర్‌లో భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో 50 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పరిషత్ ప్రాంత పర్యావరణ కన్వీనర్ డాక్టర్ శరగడం నూకరాజు మాట్లాడుతూ భావితరాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని మొక్కలను నాటాలన్నారు. మొక్కల ద్వారా పరిశుభ్రమైన ఆక్సిజన్ వస్తుందన్నారు. కార్యక్రమంలో పరిషత్ ప్రతినిధులు జయలక్ష్మి, ఆళ్ల ఓంరామ్, అప్పారావు, వానపల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూచౌక్‌లో..

వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 7న జరిగే వినాయక చవితికి మట్టి విగ్రహాలనే పూజించేలా అవగాహన కల్పించారు. కమిటీ చైర్మన్ ఆడారి కుమార్‌స్వామి మాట్లాడుతూ తిరుమల వేంకటేశ్వర స్వామి దేవస్థానం పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని, మొక్కల్ని నాటాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీరామ్మూర్తి, సోమశేఖర్‌పట్నాయక్, కొడుకుల శ్రీకాంత్, దాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు చొరవ చూపాలని ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు సూచించారు. స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెట్టు మనిషికి జీవనాధారమన్నారు. మొక్కలు నాటితే అవి వృక్షాలుగా ఎదిగి ఉష్ణతాపాన్ని నివారిస్తాయన్నారు. హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు, ఉపాధ్యాయ సిబ్బంది ప్లకార్డులు ప్రదర్శించి పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.నూకరాజు, ఏవీహెచ్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. ఏపీ బయో డైవర్సిటీ బోర్డు ఆధ్వర్యంలో తేగాడ పాఠశాలలో నక్షత్ర వనాల పెంపకంలో భాగంగా మొక్కలు నాటారు. ఎస్‌వీడీఎస్ లీడర్లు కోన అప్పారావు, జయలక్ష్మి, చక్రవర్తి, సరోజిని పాల్గొన్నారు.



డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో మొక్కలు నాటుతున్న డీవైఈవో అప్పారావు



పర్యావరణంపై ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది



తేగాడ పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎస్‌వీడీఎస్ ప్రతినిధులు



నెహ్రూచౌక్‌లో మట్టి వినాయకులను ప్రదర్శిస్తున్న ఆడారి కుమార్‌స్వామి

పరిసరాల పరిశుభ్రతతో మలేరియా నియంత్రణ

అనకాపల్లి: వర్షాకాలంలో దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు తదితర వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు వాణిజగదీశ్వరి తెలిపారు. మండలంలోని తుమ్మపాల పీహెచ్‌సీలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మాసోత్సవాలను ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల్లో మలేరియాపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దోమల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్త వహించాలన్నారు. ఇంటి ముందున్న కాలువలో చెత్త చెదారం వేయకూడదని, మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాల్లో నీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. గంబూజియా, గప్పి అనే చిన్న చిన్న చేపల్ని నీటి స్థావరా(బావులు, కుంటలు)ల్లో వదిలితే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. ఇంటిపై ఉన్న ట్యాంకులకు మూతలు అమర్చాలని, లేకుంటే దోమలు గుడ్లుపెట్టి, రోగాలకు కారణమవుతాయని పేర్కొన్నారు. దోమల బారి నుంచి రక్షణ పొందేందుకు దోమ తెరలు వాడాలని సూచించారు. దోమల నివారణకు ఇంటి పరిసరాల్లో, వీధుల్లో ఫాగింగ్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బి.మంగమ్మ, బి.సంఘం తదితరులు పాల్గొన్నారు.



దోమల నివారణ చర్యల్ని వివరిస్తున్న వైద్యురాలు వాణిజగదీశ్వరి



చింతలపాలెంలో మలేరియా నివారణ అవగాహన ర్యాలీలో వైద్య, ఆరోగ్య సిబ్బంది

కశింకోట: మలేరియా వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్ సూచించారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని చింతలపాలెంలో బుధవారం మలేరియా వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తూ ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మలేరియాకు కారణమైన దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలన్నారు. వారానికి ఒకసారి నిల్వ నీటిని తొలగించి డ్రైడే పాటించాలన్నారు. దోమల వృద్ధికి కారణమయ్యే రుబ్బు రోళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, ఆరోగ్య పర్యవేక్షకుడు కేఎస్ఆర్‌కేజీ నరసింహారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత కంటి పరీక్షలు

అనకాపల్లి: వృద్ధుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని సినియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీవీ సుబ్బారావు అన్నారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో అసోసియేషన్ సీనియర్ ప్రతినిధి కేవీ గౌరీపతి ఆధ్వర్యంలో విజయనగరం శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెల వృద్ధులకు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులు షుగర్ పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులు వైద్యుల సూచనల మేరకు సకాలంలో మందులు వాడాలని సూచించారు. 120 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి విల్లూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎంబీవీ స్వామి, సహాయ కార్యదర్శి మహేశ్వరరావు, సీనియర్ సభ్యులు కేఎం నాయుడు, కె.వీరభద్రరావు, తమ్మిరాజు, కె.గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సత్యనారాయణ మాస్టారు సేవలు అభినందనీయం

మునగపాక : మునగపాక గౌతమ పఠన మందిరంలో బుధవారం స్వర్గీయ మందపాటి సత్యనారాయణ మాస్టారు మృతికి సంతాప కార్యక్రమం నిర్వహించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో విద్యార్థులను తీర్చిదిద్దిన సత్యనారాయణ మాస్టారు ఇటీవల గుండెపోటుకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఈమేరకు పఠన మందిరంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర అధ్యక్షుడు దాడి సూరిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికే సత్యనారాయణ మాస్టారు వన్నె తెచ్చారన్నారు. స్కౌట్స్‌లో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మందిర సభ్యులు మారిశెట్టి అప్పారావు, వెలగా శ్రీనివాసరావు, దాడి అప్పలనాయుడు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి పరశురామ్, కుంది సూర్యనారాయణ, కాశీ, ఆడారి సన్యాశిరావు, బూడిద శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సత్యనారాయణ మాస్టారు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

విద్యా కానుక కిట్ల పరిశీలన

పెందుర్తి: రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వం నుంచి విద్యార్థులకు అందించనున్న విద్యా కానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను జిల్లా ఉన్నతాధికారులు బుధవారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పంపిణీకి సిద్ధంగా ఉన్న కిట్లను పరిశీలించి విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు వాటిని పూర్తిస్థాయిలో అందించాలని సూచించారు. ఆర్జేడీ విజయ్‌భాస్కర్, విశాఖ డీఈవో చంద్రకళ, సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ అదనపు కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను పరిశీలిస్తున్న జిల్లా ఉన్నతాధికారులు

విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన



విద్యార్థులకు పద్యాలు చదవడంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



విద్యార్థులకు గ్రంథాలయంలో సభ్యత్వాలు నమోదు చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట : విద్యార్థులకు గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులకు ముఖ్యంగా పుస్తక పఠనం, పద్యాలు రాయడం, చదవడం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.సీతారామమూర్తి ప్రతి రోజూ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. పురాణ ఇతిహాసాలు చదవడం, వ్యాఖ్యానించడం, వ్యాయామం, క్రీడలు తదితర అంశాలపై శిక్షణ కల్పిస్తున్నారు. క్రీడల్లో ఖోఖో ఆటలు ఆడిస్తున్నారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లిషు అనర్గళంగా చదవడం, మాట్లాడడంపై అవగాహన కల్పిస్తున్నారు. స్పోర్ట్ గేమ్స్, భగవద్గీత, రామాయణం, భాగవతం వంటి పురాణాలు కూడా పఠించాలన్నారు. శ్లోకాలు చదవడం అలవర్చుకోవాలన్నారు. ఇందులో భాగంగా బుధవారం పద్యాలు చదవడంపైన అవగాహన కల్పించారు. విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లి చదువుకోవడం కోసం సభ్యత్వాలు నమోదు కార్యక్రమం గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు ప్రారంభించారు. పలువురు విద్యార్థులు సభ్యత్వాలను చెల్లించారు.



దిమిలి గ్రంథాలయంలో నీతి కథలు చదువుతున్న విద్యార్థులు

కొనసాగుతున్న విజ్ఞాన శిబిరాలు

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ నూకినాయుడు భారతదేశంలో గల ముఖ్య నదులు పై అవగాహన కల్పించారు. నదులు ప్రాధాన్యాన్ని వివరించారు. విద్యార్థులు నీతి కథలు చదివారు. అనంతరం పలు ఆటలను ఆడించారు. కాగా గురువారం వేసవి విజ్ఞాన శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ వేసవి శిక్షణలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని ఆమె పేర్కొన్నారు.

విద్యాభివృద్ధికి పీటీఐ కుమారి సేవలు అభినందనీయం



గణపర్తి హైస్కూల్ పీటీఐ కమలకుమారిని సత్కరిస్తున్న దృశ్యం


మునగపాక : విద్యాభివృద్ధికి గణపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్ పీటీఐ (పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్) కమలకుమారి సేవలు అభినందనీయమని ఎంఈవో-2 శివనాయుడు అన్నారు. మండలంలోని గణపర్తి హైస్కూల్‌లో పీటీఐగా 7 సంవత్సరాల పాటు పనిచేసిన కమలకుమారికి బుధవారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివనాయుడు మాట్లాడుతూ కమలకుమారి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. పిల్లల్లో క్రమశిక్షణ పెంపుదలకు ఆమె చేసిన కృషిని అభినందించారు. ఇదే ఉత్సాహంతో విద్యార్థుల ఉన్నతికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఆర్పీలు కర్రి లక్ష్మీనారాయణ, బి.అచ్యుతకృష్ణ, ఆర్.సత్తిబాబు, ఎం.గోవింద, సిబ్బంది వెంకటరావు, రామలక్ష్మి, రమణాజి, వీరప్పారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం

పెందుర్తి: పెందుర్తి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం చిన్నారులకు కథలు చదవడం, రాయడం, చెప్పడం నేర్పించారు. అనంతరం ధ్యానం చేయించారు. సరదాగా ఆటలు ఆడుదాం కార్యక్రమంలో భాగంగా మ్యూజికల్ చైర్ ఆడించారు. దేశ భక్తి గీతాలపై పోటీలు నిర్వహించి.. విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులు అందించారు. లైబ్రేరియన్ సూర్యకళ, విశ్రాంత ఉపాధ్యాయుడు ధనుంజయ్, గ్రంథాలయాభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు

మునగపాక : వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మునగపాక శాఖా గ్రంథాలయాధికారి ఎల్.వి.రమణ కోరారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం మునగపాక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఇటువంటి శిక్షణ తరగతుల ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందన్నారు. ఈ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



మునగపాక శాఖా గ్రంథాలయంలో మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

న్యాయం చేయాలంటూ నిరసన



నేవీ ప్రహరీ నిర్మాణంతో కలుగుతున్న నష్టాల వివరాలను పేపర్‌పై చూపుతున్న రైతులు

రాంబిల్లి : నేవీ ప్రహరీ నిర్మాణంతో నష్టపోతున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలంటూ పెదకలవలపల్లి గ్రామ రైతులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. నేవీ ప్రహరీ నిర్మాణంతో కలుగుతున్న నష్టాలను వివరిస్తూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. పశువుల పాకలను వెళ్లే దారి లేకుండా ప్రహరీ నిర్మించడం, అంతేగాక ఈ ప్రహరీ కారణంగా రైతులు తమ పశువులను కొండపై మేపుకొనే అవకాశం లేకుండా పోయిందని మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావి దేముళ్లు ఆవేదన వ్యక్తం చేశారు.